క్లుప్తంగా

నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం


ముస్తాబవుతున్న పీహెచ్‌సీ భవనం

దహెగాం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభానికి ముస్తాబైంది. ఇది వరకు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. 15వ ఆర్థిక సంఘం నుంచి ప్రభుత్వం కోటి రూపాయాలు మంజూరు చేసింది. దీంతో భవనం పూర్తి కావడంతో ఆదివారం మంత్రి సీతక్క జిల్లా పర్యటనలో భాగంగా ప్రారంభిస్తారు.

వారసంతల వేలం వాయిదా

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వారసంత వేలంను శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీవో, ఈవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గత సంవత్సరం కంటే తక్కువగా వేలం పాడడంతో వేలంను వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీవో, ఈవో కృష్ణమూర్తి తెలిపారు. తిరిగి వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. అదే విధంగా మండలంలోని హుడ్కిలి గ్రామ పంచాయతీ పరిధిలో పశువుల వారసంత వేలం శనివారం నిర్వహించాల్సి ఉండగా.. అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి హరీష్ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లింగాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 30న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆడే సవితాప్రేం అధ్యక్షతన జరిగే చివరి సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, ,పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రేపు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం దివ్యాంగులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ శనివారం తెలిపారు. మండలంలోని దివ్యాంగులకు ఆర్టీసీ జారీ చేసే రాయితీ బస్‌పాస్‌ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నా ు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించా లని కోరారు.

రాయితీ బస్సుపాస్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): దివ్యాంగులకు రాయితీ బస్సుపాస్‌ల కోసం శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దివ్యాంగుల దరఖాస్తు ఫారంతో పాటు సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులు పరిశీలించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఆర్టీసీ రాయితీ బస్సుపాస్‌లు పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 62 రాయితీ బస్సుపాస్‌ల దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రయ్య, ఇప్ప రవి శంకర్, ఆర్టీసీ సిబ్బంది దుర్గం తులసీరాం, జుమిడి పెంటయ్య పాల్గొన్నారు.

నేడు నూతన కార్యవర్గం సమావేశం

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీ కులవార్ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గం సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ ఆదివాసీ కులవార్ మన్నెరు వార్ సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు సుంకే కిష్టయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు కాగజ్‌నగర్‌లో వనవాస కల్యాణ పరిషత్ భవనంలో సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఇంగ్లిష్ భాషాభివృద్ధి నైపుణ్యాలను ప్రతీ ఉపాధ్యాయుడు పెంపొంచుకోవాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

సేంద్రియ ఎరువుకు డిమాండ్

● పొలాల్లో మేకలు, గొర్రెల మందలు

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలం సమీపిస్తుందంటే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పంట భూములను సారవంతం చేసే పనిలో బిజీగా ఉన్నారు. సేంద్రియ ఎరువు చల్లడం, దుక్కులు దున్నడం తదితర పనులపై దృష్టిసారించారు. పొలాల్లో గొర్రెలు, మేకలు పెట్టుకోవడం లేదా వాటి పేడను పొలాల్లో తరలిస్తున్నారు. తక్కువ పశువులు ఉండడంతో వాటి పేడ లభించక డిమాండ్ పెరుగుతోంది. వాటి సంఖ్య తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు ప్రతీ రైతుకు ఎద్దు, పాడి గేదెలు ఉండేవి. వీటి పేడను పొలాల్లో చల్లుకునేవారు. వేసవిలో తాత్కాలికంగా పశువుల పాకలు ఏర్పాటు చేసేవారు. భూమిలో పోషకాలు పెరగడంతో రసాయన ఎరువుల వాడకం తక్కువగా ఉండేది. తద్వారా పంట దిగుబడి అధికంగా వచ్చేది. కొనేళ్లుగా సాగు విస్తీర్ణం పెరి బీడు భూములు తగ్గిపోయాయి. పదుల సంఖ్యలో ఉన్న పశువులను కాపాడుకోవడం గగనమైంది. దీంతో వాటి సంఖ్యను రైతులు తగ్గిస్తూ వచ్చారు.


పశువుల మంద (ఫైల్)

పశువుల ఎరువుకు డిమాండ్

పొలాల్లో సేంద్రియ ఎరువు సాంద్రత తగ్గిపోవడంతో పంట దిగుబడి తగ్గిపోయింది. ఈక్రమంలో భూమిల్లో సూక్ష్మపోషకాలు పెంపొందించుకోవడానికి రైతులు పాత పద్ధతులు అవలంబిస్తున్నారు. పొలాల్లో గొర్రెల, మేకల మందకు డిమాండ్ పెరిగిపోయింది. రాత్రికి రూ.4వేల నుంచి 5వేల వరకు తీసుకుంటున్నారు. పశువుల పేడ, వండ్రు మట్టి, పెంట కుప్పలను పొలాల్లో తరలించి కలియదున్నడంతో భూములకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, సేంద్రియ ఎరువుల వినియోగంతో పోషకాలు పెరిగి మొక్కలు బలంగా ఎదగడం వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

సేంద్రియ ఎరువుతో మేలు



పశువుల పేడను భూమిలో ఎరువుగా చల్లడంతో మొక్కలు బలంగా పెరుగుతాయి. గొర్రెలు, మేకల మందను భూమిలో నిలపడం వల్ల భూమిలో అదనంగా మొక్కకు కావల్సిన పోషకాలు సమకూరుతాయి. పురుగుల బెడద తక్కువగా ఉండడంతోపాటు అధిక దిగుబడి పొందడానికి వీలుంటుంది.

– గాజుల జక్కయ్య, బురుగుడ

పేడ లభించడం లేదు



గతంలో రైతుల వద్ద పదుల సంఖ్యలో పశువులు ఉండేవి. వాటి పోషణ భారంతో తగ్గిస్తూ వచ్చారు. ఈ క్రమంలో పశువుల పేడ లభించని పరిస్థితి. పేడ లభించినా పొలాలకు సరిపోవడం లేదు. పొలాల్లో గొర్రెలు, మేకల మందను పెట్టుకుంటాం. మందలతో భూములకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

– రవీందర్, ఆసిఫాబాద్

పశు సంపద పెరగాలి



వ్యవసాయంలో దిగుబడి పెరగాలంటే పశు సంపద పెరగాలి. అందుకోసం ప్రభుత్వాలు సహకరించాలి. సేంద్రియ ఎరువుల ద్వారా నేల సారవంతం అవడంతోపాటు పంట దిగుబడి పెరుగుతుంది.

– మిట్టు తిరుపతి, చోర్‌పల్లి

నేడు మంత్రి సీతక్క పర్యటన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

లింగాపూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి మంత్రి సీతక్క ఆదివారం రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాదవ్ లోకేందర్, చవాన్ సునీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రెబ్బెన: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటించనున్నారు. మండలంలోని నవేగాం, రెబ్బెన, కైరిగాం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానా భవనాలతో పాటు గంగాపూర్‌లోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో నిర్మించిన కళాశాల భవనాలను ప్రారంభించనున్నారు. గంగాపూర్‌లోని కేజీబీవీలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గంటుమేర, రమేశ్, సోమయ్య, దేవాజీ, సోమశేఖర్, చిరంజీవిగౌడ్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

జైనూర్: సిర్పూర్(యు) మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా బాలికల పాఠశాల భవనాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ శనివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించనున్నట్లు తెలిపారు. నాయకులు కుడ్మేత విశ్వనాథ్, అబ్దుల్ ముఖీద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

పెంచికల్‌పేట్: వంకులం గ్రామానికి చెందిన రెడ్డి ప్రవీణ్ వారం రోజుల కిత్రం సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను శనివారం పెంచికల్‌పేట్ ఎస్సై కొముర‌య్య యువకుడికి అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ పాగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు చేసి ఫోన్ వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందచేయాలని సూచించారు.

పనులు వేగవంతం చేయాలి

జైనథ్: ఏడీసీసీ బ్యాంకు నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 రోజుల్లో పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. వీలైనంత త్వరలో బ్యాంక్‌ను నూతన భవనంలోకి మార్చాలన్నారు. రైతులకు రుణాలు అందించడం ముందుండాలన్నారు. ఆయన వెంట ఏడీసీసీ మేనేజర్ శైలేందర్ రెడ్డి, ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, జగదీష్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, పోతరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవేశాలు పెంచాలి


విద్యార్థులతో చదివిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: విద్యారుల ప్రవేశాలను పెంచాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్, అనార్‌పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బలిరాం అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భీమన్‌గోంది, గిరిజన ప్రాథమిక పాఠశాల కరంజివాడలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. సమయపాలన పాటించాలని, ఆంగ్లం, తెలుగు పదాలను గుర్తించే విధంగా విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. ఎస్సీఆర్‌పీ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


శిక్షణ తరగతులకు హాజరైన అంగన్‌వాడీలు

కౌటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లకు జాతీయ నూతన విద్యా విధానంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు మెరుగైన విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షకీరా బేగం, కరుణ, పద్మ, శంకరమ్మ, హసినా బేగం, టీచర్లు పాల్గొన్నారు.

క్వారీల్లో యథేచ్ఛగా బ్లాస్టింగ్


ముత్తంపేట సమీపంలోని క్వారీ

● బీటలు వాడుతున్న గోడలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు


బీటలు వారిన ఇంటి గోడలు

కౌటాల: దీపావళి పండగ మినహా మిగిలిన సందర్భాల్లో టపాసులు పేల్చాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి. ప్రభుత్వం రూపొందించిన నిబంధనాలకు అనుగుణంగానే బాణసంచాను గోదాముల్లో నిల్వ చేయాలి. విక్రయించే దుకాణాలపై పోలీస్ నిఘా తప్పనిసరి. ఫైర్ సేఫ్టీ లేనిదే ఇక్కడ ఒక్క పని చేసేందుకు వీల్లేదు. పెద్దగా ప్రమాదం కాకున్నా టపాసుల నిల్వ వ్యాపారం, కాల్చడం వంటి అంశాల్లో అనేక జాగ్రత్తలు పాటిస్తారు. ఇక కొండలను పిండి చేసే బాంబులు వినియోగించే క్వారీల్లో అడుగడుగునా జాగ్రత్తలు తీసుకుంటారనే భావన అందరిలోనూ ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

ఇష్టారీతిన పేలుడు..

కౌటాల మండలం ముత్తంపేట గ్రామ శివారులో నాలుగు స్టోన్ క్రషర్లు ఉన్నాయి. బండరాళ్లను తీసే క్వారీలో భారీ పేలుళ్లు జరుపుతున్నారు. పేలుళ్ల కారణంగా ముత్తంపేట గ్రామంలోని పలువురి ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయి. ఉదయం లేచింది మొదలు రాత్రయ్యే వరకూ జనానికి బ్లాస్టింగ్ భయం పట్టుకుంది. భారీ పేలుళ్లు నిర్వహించనప్పుడల్లా భయాందోళనకు గురవుతున్నారు. పేలుడు పదార్థాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సంబంధిత పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వాలి. కానీ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హద్దులేని మైనింగ్..

రోడ్డు, భవన నిర్మాణ రంగానికి తప్పనిసరిగా కంకర అవసరం. ఇక్కడ క్వారీల నిర్వాహకులకు నిబంధనలు అంటే లెక్కలేదు. లీజుకు స్థలాల్లో భారీగా మైనింగ్ చేపట్టారు. చాలా లోతుగా తవ్వుతూ.. పేలుళ్లు జరుపుతున్నారు. దీంతో సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. క్రషర్ నిర్వహణకు నిబంధనలు అనేకం ఉన్నా.. ఏదీ అమలు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు పాటించని క్వారీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తాం

స్టోన్ క్రషర్ల నిర్వాహకులు నిబంధనల ప్రకారం బ్లాస్టింగ్ నిర్వహణ, కంకర తరలించాలని క్వారీ యజమానులకు ఆదేశాలిచ్చాం. క్వారీ తవ్వకాలు జరపడంతో పాటు వాహన సామర్థ్యం మేరకే కంకరను తీసుకెళ్లకుంటే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. పరిమితికి మించి కంకరను తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తాం.

– గంగాధర్, గనులశాఖ అధికారి, ఆసిఫాబాద్

ఆదివాసీలకు బావినీరే దిక్కు

● శివగూడకు సరఫరా కాని భగీరథ వాటర్
● ప్రజలకు తప్పని తిప్పలు
● పట్టించుకోని అధికారులు


ఆదివాసీలు తాగేనీటికి ఆధారపడ్డ బావి ఇదే

కెరమెరి: వానాకాలంలోనూ ఆదివాసీలకు తాగు నీటి తిప్పలు తప్పడం లేదు. కుమురం భీం ప్రాజెక్టులో వరద చేరడంతో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. వారం రోజులుగా నీరు విడుదల కాకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మధ్యలో రెండు రోజులు పనిచేసినప్పటికీ మళ్లీ పాత కథే పునరావృతం అయింది. మండలంలోని బాబేఝరి గ్రామపంచాయతీలోని శివగూడ గ్రామంలో 15 కుటుంబాలున్నాయి. అందులో 74 మంది జనాభా ఉన్నారు. గ్రామంలో ఒక్క చేతిపంపు కూడా లేదు. వారం రోజులు నుంచి భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగు నీటి కోసం అల్లాడుతున్నారు.

బావినీరే.. తాగునీరు..

గ్రామానికి సమీపంలో ఉన్న బావినీరే వారికి తాగు నీరు. అయితే ఆ బావికి ఆనుకొని చిన్న కాలువ ఉండడం వల్ల వర్షం వచ్చినప్పుడల్లా వరదతో కూడిన మురుగునీరు బావిలోకి చేరుతోంది. ఈ విషయాన్ని గతంలో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకపోవడంతో ఉపాధిహామీ అధికారులు మరమ్మతులు చేయించారు. అయితే ఆ బావి పక్కన ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లు తీయించి చుట్టూ సిమెంట్‌తో కట్టించేందుకు ప్రయత్నం చేసినప్పటికీ కూలీలతో ఆ బండరాళ్లు కదలడం లేదు. దీంతో ఆ పనిని అలాగే నిలిచిపోయింది. వారం రోజుల నుంచి భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో మూడు నల్లాలను మాత్రం ఏర్పాటు చేశారు. మిగిలిన పైపులను అలాగే వదిలేశారు. అందరూ వాటర్ ట్యాంకరు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీటిని సరాఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బావినీరే తాగుతున్నాం



వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. మధ్యలో రెండు రోజులు సరఫరా చేసి మళ్లీ నిలిపివేశారు. పంచాయతీ వారు ట్యాంకరు ద్వారా నీటిని అందిస్తున్నప్పటికీ సరిపోవడం లేదు. దీంతో సమీపంలోని బావి నీటిని తాగుతున్నాం.

– టేకం గంగాబాయి, శివగూడ

ట్యాంకర్లతో అందిస్తున్నాం



మిషన్ భగీరథ నీరు ప్రారంభం అయ్యే వరకు బాబేఝరి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నాం. నీటి పరిమాణాన్ని మరింత పెంచుతాం. బావికి మరమ్మతులు చేయించి ఆ నీటిని కూడా ఉపయోగంలోకి వచ్చేలా కృషి చేస్తాం.

– ఎండీ అమ్జద్, ఎంపీడీవో కెరమెరి

దహెగాంలో వర్షం


దహెగాంలో కురుస్తున్న వర్షం

దహెగాం: మండల కేంద్రంతో పాటు, హత్తి ని, పార్వతిపేట, ఐనం, లగ్గాం, తదితర గ్రా మాల్లో శనివారం వర్షం కురిసింది. మొక్కలకు జీవం పోసిందని రైతులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా వర్షం లేని కారణంగా విత్తుకున్న పత్తి విత్తనాలు మొలకెత్తి వాలిపోతున్నాయని ఆందోళన చెందారు. ఈ వర్షంతో విత్తనాలు మొలకెత్తుతాయని ఆనందం వ్యక్తం చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎదులాపురం: నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ నాయకులు జిల్లా కేంద్రంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ అభ్యర్థులను న్యాయం చేయాలని వాల్ పోస్టర్లు ప్రదర్శించారు. జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, నరేంద్ర మోదీ బాధ్యతవహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జూలై 4న నిర్వహించే మహాధర్నాలో విద్యార్థులు, నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్, అనిల్, సంతోశ్, శంకర్, రాజేశ్, శ్రీవర్షిణి, శృతి, మల్లీశ్వరి, అనూష, ఐశ్వర్య, భూమిక పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

జైనథ్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని గూడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కందుల గజేందర్ అన్నారు. శని వారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పాఠశా ల ఆవరణలోని కిచెన్ గార్డెన్‌లో కూరగాయల మొక్కలు నాటారు. విద్యార్థులకు రసాయన ఎరువులు లేని ఆరోగ్యకరమైన కూరగాయలు అందించాలనే లక్ష్యంతో కిచెన్ గార్డెన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోట రమ రమేశ్, శ్రీపతి రావ్, ఏఏపీసీ చైర్మన్ కంది సుజాత పాల్గొన్నారు.

భగీరథ నల్లా కనెక్షన్లపై సర్వే


సర్వే చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీవో, ఈవో కృష్ణమూర్తి

సిర్పూర్(టి): మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీవో కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటా తిరిగి సర్వే చేపట్టారు. ప్రతీ ఇంటికీ నల్లా కనెక్షన్లు ఉన్నాయా? లేదా? అనే వివరాలు సేకరిస్తున్నారు. నల్లా కనెక్షన్లు లేని వారికి తప్పనిసరిగా నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు.